క్లుప్తంగా

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

మిర్యాలగూడ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈనెల 25న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రాగూడెంలో గల బాలుర బీసీ హాస్టల్‌లో యువజన సంఘం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలందరు ఏకమైతే అన్ని రాజకీయ పార్టీల్లో వణుకు పుట్టుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, బోయిన ఉపేందర్, శ్రీకాంత్, నరేష్, సతీష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు

మిర్యాలగూడ : దామరచర్ల మండల పరిధిలోని నర్సాపురం, పెద్దతండా ప్రాథమిక పాఠశాలలకు ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని ఎంఈవో ఎం.బాలాజీనాయక్ గురువారం తెలిపారు. 3.5 సంవత్సరాల నుంచి ఐదేళ్ల లోపు విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటామని పేర్కొన్నారు. ఆకర్షణీయమైన తరగతి గదిలో కృత్యాధార బోధన అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : ది మిర్యాలగూడ రియల్ ఎస్టేట్ మీడియేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎండీ సాజిద్ ప్రకటించారు. గురువారం స్థానిక హౌసింగ్ బోర్డులోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 16న అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఆకుమర్తి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎండీ సాజిద్, ఉపాధ్యక్షులుగా చిలుముల నర్సింహ, షరీఫ్, దైద పద్మారెడ్డి, నాగునాయక్, కార్యదర్శులుగా మన్సూర్, శంకర్, అన్వర్, వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కోమల హరి, కార్యవర్గ సభ్యులుగా శంభయ్య, మెయిజ్, పుట్టపాక శ్రీను, భద్యనాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెల్లడించారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న పాదూరి శశిధర్‌రెడ్డి

వేములపల్లి : మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా సరిపడా అందించాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం వేములపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కోసం రైతులు పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సమావేశంలో రెమిడాల భిక్షం, వలమల్ల ఎల్లయ్య, బ్రహ్మచారి, బొమ్మగాని శ్రీనయ్య, పాలకూరి రాములు పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఇస్లాంపురాలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ నేత మహ్మద్ అబ్దుల్ అలీం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాలు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్టాండ్, డాక్టర్స్ కాలనీల నుంచి వచ్చే వరద నీరు ఇళ్లలోకి చేరుతోందని తెలిపారు. డ్రెయినేజీ ఎత్తు తక్కువగా ఉండటం వల్ల వర్షపు నీరు, మురుగు నీరు కలిసి రోడ్లపై ప్రవహించడంతోపాటు ఇళ్లలోకి వస్తున్నాయని వివరించారు. అధికారులు వెంటనే డ్రెయినేజీ ఎత్తు పెంచి మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలోకి నీళ్లు తాగేందుకు దిగిన 8 గొర్రెలు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. గురువారం పిట్టలగూడెం గ్రామ వాసి బండారు వెంకటయ్యకు చెందిన గొర్రెలు కాల్వలోకి దిగగా నీటిలో విద్యుత్ మోటారు కేబుల్ వైరు తేలడంతో విద్యుదాఘాతంతో గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.లక్షన్నర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

రేషన్ షాపులు ఏర్పాటు చేయరూ..

- రేషన్ బియ్యం కోసం అవస్థలు
- కిలోమీటర్ల దూరం నడిచి తెచ్చుకోవాల్సిన దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



రేషన్ తీసుకుంటున్న వినియోగదారులు(ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ బియ్యం తీసుకోవడానికి పొరుగు గ్రామాలకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బియ్యం కోసం వెళ్లిన రోజు కూలి పనులు మానుకోవడంతో ఆదాయం కోల్పోవడమే కాకుండా, బియ్యం విలువ కంటే రవాణా ఖర్చులే ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలైన నాగార్జునపేట తండా, సఫావత్ తండా, బట్టువెంకన్నబావి తండా, చెంచువాని తండా, ధన్‌సింగ్ తండా, తూటేపేట్ తండా, అల్వాల తండా గ్రామస్తులు రేషన్ బియ్యం కోసం రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జమ్మనకోట, చింతలపాలెం, గోడుమడక, నెల్లికల్లు, శీతల్‌తండా, రంగుండ్ల, అల్వాల వంటి సమీప గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య కారణంగా కొందరు ప్రతి నెలా రేషన్ తీసుకోలేకపోతున్నారని తెలుస్తోంది.

తిరుమలగిరి మండలంలో ఇలా..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడంతో తిరుమలగిరి మండలంలో రేషన్ కార్డుల సంఖ్య 12,814 నుంచి 14,371కు పెరిగింది. సెప్టెంబర్ నెల నుంచి ఈ కొత్త కార్డుదారులకు కూడా రేషన్ పంపిణీ జరగనుంది. ఇప్పటికే ఉన్న సమస్యకు తోడు, పెరిగిన కార్డుల సంఖ్యతో ఈ కష్టాలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం తిరుమలగిరి, రాజవరం, నెల్లికల్లు, రంగుండ్ల వంటి పెద్ద గ్రామ పంచాయతీల్లో మాత్రమే రెండు చొప్పున రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

రేషన్ షాపును ఏర్పాటు చేయాలి



అల్వాల తండాలో రేషన్ దుకాణం లేకపోవడంతో ప్రతి నెలా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్వాలకు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నాం. మా తండాకు ఆటో సౌకర్యం కూడా సరిగాలేదు. దీంతో నడుచుకుంటూ, లేదంటే బైక్‌ల మీద వెళ్లాల్సి వస్తోంది. తండాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు కూడా దరఖాస్తు ఇచ్చాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా తండాలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలి.

– జటావత్ వాలీ, అల్వాల తండా

ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని సఫావత్‌తండా, బట్టువెంకన్నబావి గ్రామస్తులు కొత్త రేషన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆ గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే ఆ గ్రామాల్లో కొత్తగా షాపులు ప్రారంభించే అవకాశం ఉంది. కొత్త రేషన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకుంటే, వారి దరఖాస్తులను పరిశీలించి వాటిని కూడా ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– అనీల్, తహసీల్దార్

నవరాత్రులను సోదరభావంతో నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనాలను సోదర భావంతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. డివిజన్‌లో వందలాది గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డివిజన్‌లోని దామరచర్ల మండలం వాడపల్లి, వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్‌ఎడమ కాల్వ, అనుముల మండలం ఎడమకాల్వ 14వ మైలు వద్ద, సాగర్ డ్యాం దిగువన నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ శ్రీనివాసచారి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ కేస రవి, నాయకులు రేపాల పురుషోత్తంరెడ్డి, రమేష్, మౌలాన మగ్దూం, మౌలానా జావెద్, హఫీజుద్దీన్, ఖుర్బాన్‌అలీ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



మిర్యాలగూడ టౌన్ : ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



డిండి మండల కేంద్రంలో బోనమెత్తిన మహిళలు

మిర్యాలగూడ టౌన్ : శ్రావణ మాసం చివరి గురువారాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో వెళ్లి ముత్యాలమ్మ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోళ్లు, యాటలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల సైదులు, మెరుగు రోశయ్య, సైదులు, శ్రీను, కోల శ్రీను, లింగంపల్లి శ్రీను,వెంకన్న, లింగంపల్లి మట్టయ్య, కోల వెంకన్న, రమేష్, కోల రాంబాబు, శేఖర్, ఈదయ్య, పద్మ, విజయ,నిర్మల, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

డిండి: మండల కేంద్రంలో గురువారం పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో స్థానిక బొడ్రాయి వద్దకు వెళ్లి పూజలు చేసి అనంతరం పోచమ్మ దేవాలయానికి చేరుకుని నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా బోనాల ర్యాలీలో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మల్లేష్, ఏటి కృష్ణ, కాశన్న, శ్రీను, వెంకటేష్, సురేష్, వెంకటయ్య, లక్ష్మణ్, లింగమయ్య, సలయ్య, సురేష్, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీ, శ్రీదేవి, పార్వతమ్మ, సాయమ్మ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేటలో బోనాల పండుగను గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామదేవత ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

నానో యూరియాతో రైతులకు మేలు

- ఏడీఏ సరిత



గుర్రంపోడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సరిత

గుర్రంపోడు : నానో యూరియా వినియోగం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని హాలియా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు ఎం.సరిత అన్నారు. గురువారం గుర్రంపోడు మండలకేంద్రంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. నానో యూరియా ద్రవరూపంలో చిన్న డబ్బాలో లభిస్తుందని, ఇందులో పంటలకు అవసరమైన నత్రజని సమృద్ధిగా లభిస్తుందన్నారు. సంప్రదాయ యూరియా బస్తా రూ.266 కాగా రూ.225లకు వచ్చే నానో యూరియా అరలీటర్ డబ్బా ఎకరా పొలానికి సరిపోతుందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగబడులు అందించే నానో యూరియా పర్యావరణానికి కూడా మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓ మాధవరెడ్డి, ఏఈఓ జితేందర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

21ఎంఎల్‌జీ 01 మిర్యాలగూడ : దామరచర్లలో నానో ఉత్పత్తులతో ఏఓ, ఏఈఓలు, రైతులు

మిర్యాలగూడ : వివిధ పంటల సాగులో నానో యూరియా వాడడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని దామరచర్ల ఏఓ రుషేంద్రమణి అన్నారు. గురువారం ఆమె దామరచర్ల మండల కేంద్రంలో మన గ్రోమోర్ వద్ద రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులు నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సైదులు, ప్రియాంక, పార్వతి, సురేష్, మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మాడుగులపల్లి : మండలంలోని చెరుపల్లి గ్రామానికి చెందిన వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, బీజేపీ నాయకుడు వీరబోయిన సైదులుయాదవ్ మృతి చెందారు. గురువారం సైదులు మృతదేహాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, నాయకులు రవి, వడ్డె శ్రీనివాస్‌రెడ్డి, చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నాగరాజు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



పవర్‌ప్లాంట్ గేట్ వద్ద సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ప్రజలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం శివారులోగల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులతోపాటు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ చిత్రపటాలకు స్థానికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌కు భూములు ఇచ్చామని, ఎన్నో ఏళ్లుగా తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోరాటం చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వం స్పందించి శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

- ఆర్డీఓ రమణారెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

దేవరకొండ : గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో దేవరకొండ ఏఎస్పీ మౌనికతో కలిసి ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్, విద్యుత్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సైతం ఆయా కాలనీల్లో ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐలు వెంకట్‌రెడ్డి, బీసన్న, ఎంపీడీఓ దానియల్, అధికారులు, తదితరులు ఉన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత కోసమే ‘ఉల్లాస్’



మాట్లాడుతున్న ఎంఈఓ బాలు

మిర్యాలగూడ : సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎంఈఓ బాలు అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాలు, ఆపైబడిన చదువుకోని వయోజనులందరూ ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు కీలకమైన జీవన నైపుణ్యాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, ఉపాధ్యాయులు భాగస్వాములవుతారని చెప్పారు. చదువు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ బాలు, ఆర్పీలు రఘు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, శ్రీశైలం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా అందించాలి

మిర్యాలగూడ అర్బన్ : రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్ అన్నారు. గురువారం యూరియా కోసం క్యూలో నిలబడిన రైతుల కష్టాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం సబ్సిడీలో కోత విధించగా, రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో వినతి పత్రాలతో సరిపెడుతోందని విమర్శించారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఎరువుల సరఫరాలో జాప్యం చేయడం రైతులను నష్టపరుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిల్లుట్ల సైదులు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

మాడుగులపల్లి : ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని ఇందుగుల, ఆగామోత్కూర్ గ్రామాలను ఆయన సందర్శించి ప్రాథమిక పాఠశాలలు, పీహెచ్‌సీ, పల్లె దవాఖానాలను పరిశీలించారు. వర్షాల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో నీరు నిలిస్తే దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపించే అవకాశం ఉందని హెచ్చరించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని, ఆర్‌ఐలు నాగయ్య, రేణుక, డీటీ సైదులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్ష.. ‘సఫాయి సురక్ష’

- మున్సిపల్ కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక స్కీం
- కొత్త పథకానికి శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే మెడికల్ కిట్లు పంపిణీ చేసిన అధికారులు



పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

దేవరకొండ: మున్సిపాలిటీల్లో రోజూ చెత్తను సేకరించి.. మురుగు కాలువల్లో పేరుకుపోయే మురుగును తొలగిస్తూ పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ అనారోగ్యం బారిన పడుతున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో సఫాయి సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో కార్మికుల సంక్షేమానికి పాటుపడుతూనే వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా వర్తింజేసేలా..

పథకం అమలులో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పూర్తి వివరాలను శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు సేకరించే పనిలో పడ్డారు. పూర్తి వివరాలను సేకరించిన తరువాత కార్మికులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. సఫాయి సురక్ష పథకం అమలుకు కార్మికుల ఆరోగ్య వివరాలను వారి వద్ద నిక్షిప్తం చేసి ఉంచుతున్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా వర్తింపజేసేలా శానిటేషన్ విభాగం అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నారు.



ఆరోగ్య పరిరక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

ఆరోగ్య పరిరక్షణ కిట్లు అందజేత

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఏటా ప్రభుత్వ పరంగా ఆరోగ్య పరీరక్షణ కిట్లు అందజేసేవారు. అదే మాదిరిగా సఫాయి సురక్ష పథకం ద్వారా కార్మికులందరికీ కచ్చితంగా ఆరోగ్య పరిరక్షణ కిట్లల్లో ఉండే చేతికి గ్లౌజులు, బూట్లు, తలకు రక్షణ హెల్మెట్‌లను పంపిణీ చేశారు. కొంతకాలంగా వీటిని సక్రమంగా అందించక కార్మికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు సఫాయి సురక్ష పథకం కింద వీటన్నింటిని అందించేందుకు చర్యలు చేపడతారు.

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



దేవరకొండ మున్సిపాలిటీలో సఫాయి సురక్ష పథకాన్ని అమలు చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తాం. వారి ఆరోగ్య వివరాలతోపాటు వారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధను వహించి ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ఆరోగ్య పరిరక్షణ కిట్లు పంపిణీ చేసి కార్మికులందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక దృష్టిసారిస్తాం.

– సురిగి శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, దేవరకొండ

నేడు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి రాక

నిడమనూరు : నిడమనూరు మండలంలోని బొకమంతలపహాడ్‌లో ‘పనుల జాతర’ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. అలాగే రూ. 20 లక్షల వ్య యంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి, రూ. 12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. ఈ నిధులను ఉపాధి హామీ, జిల్లా గ్రామీణాభివృద్ధి పథకాల నుంచి కేటాయించారు. ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమం ద్వారా గ్రామాలలో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కోళ్ల పెంపకానికి షెడ్ల నిర్మాణం, వండ్ల తోటల పెంపకానికి ఎరువుల తయారీ, వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టనున్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు భరోసా

నిడమనూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. గురువారం మార్కెట్‌లో 19 మంది లబ్ధిదారులకు రూ. 9,10,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి ద్వారా పేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన మసిముక్కు వెంకటమ్మ, పందుల యాదమ్మలకు చెక్కులను అందజేశారు. వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీను పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం జిల్లా పౌరసరఫరాల అధికారి, మండల స్పెషలాఫీసర్ వెంకటేశం ఆధ్వర్యంలో స్పెషల్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధల మేరకు ఎరువులు విక్రయించాలని సూచించారు. ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.